# గోదావరి తల్లికి ఘనంగా గంగాహారతి

**శెనార్తి మీడియా, రామగుండం:**

గోదావరిఖని శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర స్థలంలో గోదావరి నదీమాతకు మహా హారతి బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుక భక్తుల సందోహంతో రద్దీగా కదలాడింది. ముందుగా పరమశివునికి అభిషేకం, నది పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య భక్తులు దీపారాధనలు చేశారు. కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు భక్తి వాతావరణాన్ని మరింత ఉద్ధాటంగా మార్చాయి. క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ గోదా వరి తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఆర్థిక ప్రగతికి





ప్రతీక అని తెలిపారు. నదీ తీరాలు ఋషుల తపోభూములని పేర్కొన్నారు. డాక్టర్ లక్ష్మీవాణి మాట్లాడుతూ హిందూ ఐక్యత దేశ రక్షణకు అవసరమని, ఇలాంటి ధార్మిక వేదికలు సంఘటిత శక్తిని ప్రతిబింబిస్తాయని అన్నారు. ప్రధాన అర్చకులు వోజ్జల వెంకటేశ్వరశర్మ సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో గోదావరి హారతి కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. వేదమంత్రాల నడుమ కుంభహారతి, నక్షత్రహారతి, కర్పూరహారతి, ధూపహారతులు నిర్వహించగా భక్తులు కరతాళధ్వనులతో గోదావరి తల్లిని ఆలరించారు. కూచిపూడి కళాకారిణి ఉజ్వల శిష్యబృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీవాణి, డాక్టర్ రమ్య చిరంజీవి, సీపీ సత్యనారాయణ గౌడ్, మోతిపాటి ఆనంద్, తాటిపల్లి వెంకన్న, పల్లెర్ల చంద్రమౌళి, గందెశ్రీ భవాని వీరేశం, గుండా మంజుల, అంశాల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**శెనార్తి మీడియా, గన్నేరువరం**

గన్నేరువరం మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, ఈ నెల 16న చేపట్టనున్న మహా ధర్నా పోస్టర్‌ను మండల యువజన సంఘాల నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ, రోడ్డు మంజూరు అయి మూడు సంవత్సరాలు గడిచినా గుండ్లపల్లి–పోత్తూరు రహదారి పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజలు కలిసి రోడ్డుపైకి వస్తేనే డబుల్ రోడ్డు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ధర్నాను విజయవంతం చేయడానికి మండలంలోని ప్రతి యువజన సంఘ నాయకుడు తప్పనిసరిగా పాల్గొనాలని వారు కోరారు.

# పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

**శెనార్తి మీడియా, మంథని:**

పేద ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం వేగంగా పంపిణీ చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చెప్పారు. బుధవారం రాత్రి మంథని మండలం అడవి సోమనపల్లి గ్రామంలో పర్యటించిన మంత్రి, పూర్తయిన 40 ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి లబ్ధిదారులకు హక్కుల పత్రాలు అందించారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కూడా చేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... తమ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే పేదలకు ఇచ్చిన మాట మేరకు తొలి దఫాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున మొత్తం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతి సోమవారం బిల్లులు జమ చేస్తున్నామని పేర్కొన్నారు.



నేడు మంథని నియోజకవర్గంలో గృహ ప్రవేశాలు జరగడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందే వరకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల వరకూ మరో మూడు విడతల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కొనసాగుతుందని తెలిపారు. పేదల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, గ్యాస్ సిలిండర్‌ను 500 రూపాయలకు అందజేయడం, రేషన్ ద్వారా సన్న బియ్యాన్ని ఉగాది నుంచి పంపిణీ చేయడం, 11 లక్షల కొత్త రేషన్ కార్డులను అందించడం చేపట్టిన కార్యక్రమాలని తెలిపారు. సోమనపల్లి వద్ద 200 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులు జరుగుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వంలో రైతులు తాలు కట్టింగ్ సమస్యతో ఇబ్బందులు పడితే, ప్రజా ప్రభుత్వం ఆ సమస్యకు పూర్తిగా స్వస్తి పలికిందని తెలిపారు. సన్నరకం వడ్లకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ అందించామని, 25 లక్షల 65 వేల మంది రైతులకు 20,681 కోట్ల రూపాయల రుణమాఫీ పూర్తిచేసినట్లు చెప్పారు. వానాకాలం పంటలో సన్న రకం పండించిన ధాన్యానికి 1800 కోట్ల బోనస్ అందించినట్లు వెల్లడించారు. ఆధునిక సాంకేతికతతో లాభసాటి వ్యవసాయం పై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

అడవి సోమనపల్లిలో పైలెట్ ప్రాజెక్టుగా అమలవుతున్న ఇందిరమ్మ ఇండ్లలో నేడు 40 గృహ ప్రవేశాలు జరగడం సంతోషకరమని కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు. నిర్మాణ పురోగతిని అనుసరించి ప్రతి సోమవారం నిధుల విడుదల జరుగుతుందని తెలిపారు. తరువాత గ్రామంలో 3 కోట్ల 5 లక్షలతో నిర్మించనున్న సబ్‌స్టేషన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ రాజేశ్వర రావు, మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.


# నూతన వధూవరులకు ఆశీర్వాదం



**శెనార్తి మీడియా, గన్నేరువరం**

కరీంనగర్ జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ కూతురి వివాహం గురువారం కరీంనగర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి గన్నేరువరం మండల టీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మ్యాదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా ఈసీ మెంబర్ బూర తిరుపతి, మండల ప్రెస్ క్లబ్ సభ్యులు బుర్ర రాజ్ కోటి గౌడ్, బుర్ర అంజయ్య, బుర్ర కోటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బీజేపీ నాయకులు



**శెనార్తి మీడియా, జమ్మికుంట**

వీణవంక సింగిల్ విండో మాజీ చైర్మన్ పెద్ది మల్లారెడ్డి కూతురు డా. సుప్రియ – డా. ఆదిత్య కిషోర్‌ల వివా హం బుధవారం కరీంనగర్‌లోని కొండ సత్యలక్ష్మి గార్డెన్‌లో జరిగింది. అదేరోజు జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామా నికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు పెరవేన రమేష్ కుమారుడు అఖిల్ – దివ్య దంపతుల వివాహం జమ్మికుంట లోని వైఎంపీ ఆర్ గార్డెన్‌లో జరిగింది. ఈ వాహ వేడుకలకు హాజరైన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు, హుజురాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి, జమ్మికుంట మున్సిప ల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, ఇల్లంద దకుంట మండలం మాజీ బీజేపీ అధ్యక్షు డు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, ఈటల రాజేం దర్ పీఏ ఎదులాపురం నరేందర్, బీజేపీ నాయకు లు కొమ్ము అశోక్, అమరేందర్ తదితరులు వధూ వరులను ఆశీర్వదించారు.

# రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రాధాన్యం



**శెనార్తి మీడియా, రామగుండం:**

రామగుండం నియోజకవర్గంలో రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రామారావుపల్లితో పాటు పలు గ్రామాల్లో ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాలను రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆయన సతీమణి మనాలి ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ, రైతు సమస్యలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి పెట్టిందని స్పష్టం చేశారు. రైతులు దళారుల చేత మోసపోకుండా, సింగిల్ విండో వ్యవస్థ ద్వారా ప్రభుత్వం నేరుగా వడ్లను కొనుగోలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రైతు ప్రభుత్వం, రైతు మద్దతు ధరను కాపాడు ప్రభుత్వం అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాయకత్వంలో రైతుల సమస్యలను అర్థం చేసుకుని రోజువారీగా మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. గింజకు ఎలాంటి కటింగ్ లేకుండా న్యాయమైన ధర ఇవ్వడమే ఈ కేంద్రాల లక్ష్యమని చెప్పారు. రైతులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రజానుకూల విధానాన్ని అభినందిస్తూ, రామగుండం రైతుల నిజ మైన రక్షకుడిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.



# గోదావరిఖని షాపింగ్ కాంప్లెక్స్ స్లాబ్ పనులకు శ్రీకారం

**శెనార్తి మీడియా, రామగుండం**

రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం గోదావరిఖని చౌరస్తా వద్ద నిర్మాణంలో ఉన్న నూతన షాపింగ్ కాంప్లెక్స్ స్లాబ్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ గోదావరిఖని నగర అభివృద్ధి దిశగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఈ షాపింగ్ కాంప్లెక్స్ పూర్తయితే ప్రజలకు వాణిజ్య సదుపాయాలు మరింత మెరుగ్గా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. స్థానిక వ్యాపారులు, చిన్న వ్యాపారస్తులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని హామీ ఇచ్చారు. నగర ఆధునీకరణలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**రామగుండం అభివృద్ధే నా ధ్యేయం: రాజ్ ఠాకూర్**

రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎలాంటి అడ్డంకులు వచ్చినా వెనక్కి తగ్గేది లేదని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ఈరోజు ఆయన జనగామలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్ పనులను ప్రారంభించారు. జనగామ ప్రాంత అభివృద్ధికి మరింత వేగం చేకూర్చేందుకు సుమారు రూ.3 కోట్లతో రోడ్ వెడల్పు పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ (UGD) పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే తన ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.

**పరామర్శ**

ఇటీవల గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఇంచార్జ్ దస్తగిరి మరణం పట్ల రామగుండం శాసన సభ్యుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఆయన దస్తగిరి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆత్మీయంగా ధైర్యం చెప్పారు. దస్తగిరి సేవలను ఎమ్మెల్యే గుర్తుచేసుకుంటూ కుటుంబం నిండా కోలుకోలేని లోటు ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో ప్రభుత్వంతో పాటు తనవంతు సహాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రెస్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# బెల్ట్ షాపులు, పర్మిట్ రూములపై చర్యలు తీసుకోవాలి



**శెనార్తి మీడియా, గోదావరిఖని:**

గోదావరిఖని ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్ట్ షాపులు, పర్మిట్ రూములపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ యువజన నాయకులు ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. డిసెంబర్ 1 నుంచి కొత్త వైన్ షాపులు ప్రారంభం కానున్న నేపథ్యంలో నిబంధనల ఉల్లంఘనలను అరికట్టాలని, పర్మిట్ రూములను రద్దు చేయాలని బూరుగు వంశీకృష్ణ డిమాండ్ చేశారు. బెల్ట్ షాపులు మూసివేస్తే యువతలో మద్యపానం గణనీయంగా తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



- **ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య**

**శెనార్తి మీడియా, రామగుండం**

సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో నిరంతరంగా చర్చలు జరిపి సాధించేందుకు ఏఐటియుసి కట్టుబడి ఉందని యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. గోదావరిఖనిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, స్ట్రక్చర్ సమావేశాలు నిలిచిపోవడంతో సమస్యలు పేరుకుపోయాయని, ఇటీవల చర్చల్లో పలు అంశాలు పరిష్కారమయ్యాయని చెప్పారు. స్వంత ఇల్లు పథకం అమలు కోసం యూనియన్ ప్రతినిధులను కమిటీలో చేర్చడం, మైనింగ్ స్టాఫ్ మరియు ట్రేడ్స్‌మెన్‌కు సర్ఫేస్ పోస్టింగ్‌లు, నిలిచిపోయిన మెడికల్ బోర్డు పునః ప్రారంభంపై యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. కార్మికుల పిల్లలకు ఈ నెల 16న కొత్తగూడెంలో ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. డిస్మిస్ అయిన కార్మికులకు మరో అవకాశం, సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ఎగ్జిక్యూటివ్ గ్రేడ్ ప్రమోషన్ వంటి ప్రతిపాదనలపై కూడా యాజ మాన్యం సానుకూలంగా స్పందించిం దన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే సంఘాల మాటలు నమ్మొద్దని, ఏఐటి యుసి ఎల్లప్పుడూ కార్మికుల పక్షానే పని చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నేతలు మడ్డి ఎల్లా గౌడ్, వై.వి.రావు, ఆరెల్లి పోషం, గౌతం గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.